

# చిలుక తీర్పు

చాలా కాలం కిందట సంగతి, అమరావతిని రాజధానిగా చేసుకొని వెంకటాద్రి నాయనింగారు కృష్ణా తీరాన్ని పరిపాలిస్తున్న కాలమది. ఆ ప్రభువులకు కవులన్నా, పండితులన్నా, గాయనీ గాయకులన్నా, శిల్పులన్నా చాలా ఇష్టం. వారికి మడి మాన్యాలిచ్చి, వార్షికాలను ఏర్పాటుచేసి వెంకటాద్రి నాయనింగారు లలిత కళలను పోషిస్తూ ఉండేవారు.

వారి హయాంలోనే ఇద్దరు శిల్పులు ఒకేసారి వారి దర్శనానికి వచ్చారు. ఇద్దరూ గొప్పవారే. ఇద్దరూ పనితనం గలవారే. నిజానికి వారిని సన్మానించి పంపించినట్లయితే ఏ కథా లేదు. ప్రభువుల వారికో ఆలోచన వచ్చింది. వినోదం చూడాలన్న కుతూహలమూ కలిగింది.

వారిద్దరిలో ఎవరు గొప్పవారో తెలుసుకొందామన్న కుతూహలమున్నూ వారి మనస్సులో రేకెత్తింది.

ఆ ఉభయులకూ తగిన వసతి సదుపాయాలను ప్రభువులు కలిగించారు. తమ తల్లిగారి చిత్తరువును ఆ శిల్పులకు చూపించారు.

సహజ వర్ణాలతో సహా తమ అమ్మగారి శిల్పాన్ని రూపొందించవలసిందిగా వారు ఆ శిల్పులను కోరారు. అవసరమైనంత వ్యవధి తీసుకోవచ్చుననీ, కావలసిన పరికరాలు ఇతర సంభారాలూ ఎలాంటి ఆలస్యమూ లేకుండా సరఫరా అవుతాయనీ ప్రభువులు అన్నారు. శిల్పులు ఒక ప్రశాంతమైన తోటలో మకాం చేశారు. ఇద్దరి గుడారాలూ ఎదురుబొదురుగానే ఉన్నాయి. ఉభయులూ రాత్రింబవళ్ళు పనిచేశారు.

ఓ సంవత్సరానికి లోపుగానే విగ్రహాలు తయారయ్యాయి.

ఒక శుభ ముహూర్తాన ఆ రెండు విగ్రహాలనూ సభకు తెప్పించారు ప్రభువులు. ఒక్క ప్రాణం మినహాగా ఆ విగ్రహాలు అక్షరాలా రాజమాతను పోలి ఉన్నాయి. రాజమాత పూల సెజ్జను, ఫలాలున్న పళ్లెరాన్ని తీసుకొని, దేవాలయానికి వెడుతున్న భంగిమలో ఆ విగ్రహాలున్నాయి.

ప్రభువులు సంతోషించారు. కానీ ఈ రెండు విగ్రహాలలోనూ ఏ విగ్రహం ఉన్నత స్థాయికి చెందినదో ఎలా తెలుసుకోవడం, దీనికో ఉపాయాన్ని ఆలోచించారు ప్రభువువారు. వారి దగ్గర పెంపుడు చిలుకలున్నాయి. ఒక చిలుకను తెప్పించి ఆ విగ్రహాల దిక్కుగా ఎగుర వేశారు.

ఆ చిలుక రెండు విగ్రిహాల చుట్టూ తిరిగి కుడి వేపునగల విగ్రిహం చేతిలో ఉన్న పండ్ల పళ్లెం మీద క్షణకాలం ఆగి ముక్కుతో పొడిచి మరీ ఎగిరి పోయింది. ప్రభువులు రెండవ చిలుకను కూడా తెప్పించి, ఇలాగే ఎగుర వేశారు. అదిన్నీ రెండు విగ్రహాల చుట్టూరా తిరిగి కుడి వేపున గల విగ్రహం చేతిలో ఉన్న పండ్ల పళ్ళెం మీద వాలి, కొన్ని క్షణాల తరువాత ఎగిరి పోయింది.

ఈ దృశ్యాన్ని చూచిన సభాసదులందరూ కుడివైపున గల శిల్పమే గొప్పదనీ, ఆ బొమ్మను చెక్కిన శిల్పికి బహుమానం ఇవ్వాలనీ ఏకగ్రీవంగా అన్నారు. ఆ శిల్పి ఎంతో సహజంగా, ఆ బొమ్మను చెక్కబట్టే చిలుకలు ఆ బొమ్మ చేతిలోని పళ్లెం మీద వాలాయని వారు అభిప్రాయపడ్డారు.

"కాదు" అన్నారు ప్రభువులు.

"మా దృష్టిలో రెండవ శిల్పమే గొప్పది. రెండవ శిల్పం మీద కూడా చిలుకలు తిరిగాయి, కానీ వాలలేదు. అది బొమ్మ కాదనీ మనిషేననీ చిలుకలు అనుకోవడమే అందుకు కారణం. నేనా రెండవ శిల్పికి బహుమతి నిస్తున్నాను. మొదటి శిల్పిని కూడా తగు విధంగా గౌరవిస్తున్నాను" అన్నారు ప్రభువులు.

—o—